# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

12.5.2026
మంగళవారం Tuesday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 283

పేజీలు : 12
Pages : 12

వెల రూ.2.00

Published from : Hyderabad
Circulated to : Telangana






## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి, చాకలి ఐలమ్మ మనవరాలు

2



## ఆరోగ్య శాఖలో కొలువుల పండగ

- నేడు 1919 మందికి నియామక పత్రాల అందజేత
- ఉస్మానియా మెడికల్ కాలేజీలో భారీ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహా

2





## ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి

- ఈ నెలాఖారుకు 90 శాతం పురోగతి సాధించాలి
- సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశం
- కలెక్టర్లతో వీసీ
- గ్రేటెడ్ కమ్యూనిటీలు, నివాస సంఘాలను భాగస్వామ్యం చేయాలని సూచన

2

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

- రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు
- కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు

3



## పరారీలో కేంద్ర మంత్రి కొడుకు బండి భగీరథ

- నిందితుడిని పట్టుకుంటాం
- మరోసారి బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తాం
- సిట్ చీఫ్ లతిరాజ్



2

## బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్

### తక్షణ విచారణకు ఆదేశం

- కేసు నమోదులో జాప్యంపై ఆగ్రహం
- చట్టం ఎవరికీ చుట్టం కాదన్న ముఖ్యమంత్రి
- సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు
- మహిళా ఐపీఎస్ పర్యవేక్షణలో దర్యాప్తు



**హైదరాబాద్, మే 11 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ కేసులో తక్షణమే లోతైన విచారణ జరిపించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. మే 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ, ఇప్పటివరకు నిందితుడిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, కనీసం ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం ఎందుకు జరిగిందని ఆయన పోలీసులను ప్రశ్నించారు. ఈ క్రమంలోనే కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలు మైనర్ బాలిక కావడం, కేసు అత్యంత సున్నితమైనది కావడంతో, ఈ దర్యాప్తును ఒక మహిళా ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో

మిగతా 2 లో



## రాష్ట్రానికి వచ్చి ప్రధాని సుద్దులు

అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు

ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు

.. వివరాలు 3లో



## కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ కీలక భేటీ

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు

.. వివరాలు 3లో

# అందరికీ సమాన విద్యే మా లక్ష్యం

### కుల వివక్షకు చరమగీతం..

### కులాల కుంపట్లు వద్దు.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లే ముద్దు



- నాణ్యత లేని కిట్లు ఇస్తే 'బొక్కలో' వేయిస్తా!
- టీచర్లూ.. ఒక గంట అదనంగా పనిచేయండి
- 60 రోజుల్లోనే 11 వేల ఉద్యోగాల భర్తీ
- రూ.1,100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- 100 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం
- ఎల్బీ స్టేడియంలో 'విద్యా వారోత్సవాలు' ప్రారంభం

**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో కులాల వారీగా విడిపోయిన విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి, అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'విద్యా వారోత్సవాల'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ. 1,011 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'కు శంకుస్థాపన చేయడంతో పాటు విద్యాశాఖకు సంబంధించి మొత్తం

## రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రంతో సఖ్యత

### బీజేపీ అంటే 'బ్రిటిష్ జనతా పార్టీ'

### విభజించి పాలించడమే వారి నైజం



- అనుభవరాహిత్యం, అహంకారంతో దేశానికి నష్టం
- చిట్‌చాట్‌లో సీఎం సంచలన వ్యాఖ్యలు

2

## ఇంధన భద్రతపై రాజ్‌నాథ్ కీలక భేటీ

- నిత్యావసరాల కొరత రాకుండా పటిష్ఠ చర్యలు
- ప్రజలు ఆందోళన చెందవద్దు
- చమురు పొదుపు, బంగారం కొనుగోళ్లపై ప్రధాని మోదీ పిలుపును అనుసరించాలని విజ్ఞప్తి

4



## జూలై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ'

4



- 125 రోజులకు పెరగనున్న పనిదినాలు
- 20 ఏళ్ల నాటి చట్టానికి కేంద్రం స్వస్తి



## భార్య బానిస కాదు!

- జంతువులా చూసే హక్కు లేదు
- ఆత్మగౌరవంతో బతికే హక్కు అందరికీ ఉంది
- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- గృహ హింస కేసులో నిందితుడి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

4



## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా
# గద్వాల విజయలక్ష్మి

**సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు**

**హైదరాబాద్, మే 11:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు చైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

## 13న పాలిటెక్నిక్ ప్రవేశ రీక్ష

**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకుఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి

**సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశం**

**ఈ నెలఖారుకు 90 శాతం పురోగతి సాధించాలి**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్, మే 11 :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ రివిజన్' (సర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, నమోదు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలోనే షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో, ఈ నెలాఖరు నాటికి మ్యాపింగ్ ప్రక్రియలో కనీసం 90 శాతం పురోగతి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీల సహకారం తీసుకోవాలని సీఈఓ సూచించారు. స్లమ్ ఏరియాలు (బస్తీలు), గేటెడ్ కమ్యూనిటీలను స్వయంగా సందర్శించి అక్కడి ప్రతినిధులతో మాట్లాడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ పరిధిలోని బీఎల్‌ఓలను సంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. ఓటర్లకు సహాయం అందించేందుకు సూపర్ వైజర్ స్థాయి అధికారులతో ప్రత్యేక 'హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, రేషన్ షాపు డీలర్లు, ఉద్యోగ సంఘాలను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు మరియు శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం అటువంటి ఓట్లపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే 80 ఏళ్లు పైబడిన ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మ్యాపింగ్ పురోగతిని వివరించాలని కలెక్టర్లకు తెలిపారు. ఎన్నికల విధుల్లో లేని అనధికార వ్యక్తులతో ఎటువంటి గోప్యసమాచారాన్ని పంచుకోవద్దని సీఈఓ హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇళ్లను లేదా ఓటర్లను గుర్తించడంలో మాత్రమే బీఎల్‌ఓల సహాయం తీసుకోవాలని, తప్పుగా జరిగిన మ్యాపింగ్‌లను తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్లు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# అందరికీ సమాన విద్యే మా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

రూ. 1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం వల్ల సమాజంలో కుల వివక్ష పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్షను రూపుమాపేందుకే 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మి, అందుకే విద్యాశాఖను మరెవరికీ ఇవ్వకుండా తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. సమీక్షల సమయంలో తనను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడాలని అధికారులను కోరారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, అధికారంలోకి వచ్చిన కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. ఏలాంటి వివాదాలకు తావులేకుండా 36 వేల మంది టీచర్ల బదిలీలు, 22 వేల మందికి పదోన్నతులు కల్పించామని, ఈ విజయాన్ని నీతి ఆయోగ్ సైతం అభినందించిందని గర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నామని, బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులను 8 శాతం నుండి 15 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు.

### నాణ్యత లేని కిట్లు ఇస్తే 'బొక్కలో' వేయిస్తా!



విద్యార్థుల కోసం రూ. 1,000 కోట్లతో పంపిణీ చేస్తున్న ఎడ్యుకేషన్ కిట్ల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని సీఎం తెలిపారు. విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని జైలుకు (బొక్కలో) పంపే బాధ్యత తనదని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచామన్నారు. కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించామని, త్వరలోనే అన్ని స్కూళ్లలో పాలు, రాగిజావతో కూడిన పోషకాహారాన్ని అందిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని, టీచర్లు తమ ఉద్యోగాన్ని కేవలం పనిగా కాకుండా ఒక బాధ్యతగా భావించాలని కోరారు. 19 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, వారి తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు రోజుకు ఒక గంట అదనంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా విధానాలను అధ్యయనం చేయడానికి ఇప్పటికే 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించామని, అవసరమైతే మరిన్ని దేశాలకు పంపిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి దేశ భవిష్యత్తును నిర్మించే వేదికలని ముఖ్యమంత్రి ఉద్వేగభరితంగా ప్రసంగించారు.

# రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రంతో సఖ్యత



- బీజేపీ అంటే 'బ్రిటిష్ జనతా పార్టీ'
- విభజించి పాలించడమే వారి నైజం
- అనుభవరాహిత్యం, అహంకారంతో దేశానికి నష్టం
- చిట్‌చాట్‌లో సీఎం సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 11:** రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని, అయితే తెలంగాణ హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ వైఖరి, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఘాటుగా స్పందించారు. తాము బీజేపీని ఓడించి అధికారంలోకి వచ్చామని, కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. బ్రిటిష్ వారి తరహాలోనే విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. బీజేపీ ఎన్నికల విధానం 'జెమిని సర్కస్'లా ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలను బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణించొద్దు అని చెప్పడం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ, ఆర్థిక విధానాల వైఫల్యమేనని ధ్వజమెత్తారు. ఏ రాష్ట్రంలో గెలవాలన్నా అక్కడ ఎఫ్ఐఆర్‌లను ఆయుధంగా వాడుకోవడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తన లక్ష్యమని, దీనికి ప్రధాని మోదీ కూడా అంగీకరించారని రేవంత్ తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని, మెట్రో విస్తరణ, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్, మూసీ ప్రాజెక్టు వంటి అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించాలని ఆకాంక్షించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఏకంగా 818 మంది మావోయిస్టులు సరెండర్ కావడం చారిత్రాత్మకమని సీఎం తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని వ్యాఖ్యానించారు. గణపతి వంటి సీనియర్ నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని, వారికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందిస్తామని పిలుపునిచ్చారు.

# బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్

మొదటి పేజీ తరువాయి

కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. విచారణలో ఎలాంటి లోపాలు జరగకుండా, అత్యంత పారదర్శకత పాటించాలని సిట్ బృందానికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను చట్టప్రకారం రికార్డ్ చేసిన పోలీసులు, సంఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా మరియు డిజిటల్ ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనలో ఉన్న సమయంలో ఈ కేసు వెలుగులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి. కేంద్రమంత్రి కుమారుడు కావడంతోనే ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందంటూ ప్రతిపక్షాల నుండి విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, చట్టం ముందు ఎవరూ అతీతులు కారని, నేరం రుజువైతే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసుపై ప్రస్తుతం సిట్ బృందం దర్యాప్తును ముమ్మరం చేసింది. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





# పరారీలో బండి కొడుకు

**నిందితుడిని పట్టుకుంటాం**

**సిట్ చీఫ్ రితిరాజ్ ధీమా**

**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసు విచారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. సిట్ చీఫ్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం పేట్ బషీరాబాద్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించి కేసు పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, త్వరలోనే అతడిని పట్టుకుంటామని స్పష్టం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ (684/2026) ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ రితిరాజ్ తెలిపారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఒకసారి రికార్డ్ చేశామని, మరిన్ని వివరాల కోసం మరోసారి స్టేట్‌మెంట్ తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఫోన్ కాల్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాల్సి ఉందని, చట్టప్రకారం నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా కార్యాచరణ సిద్ధం చేశామని వివరించారు.

# ఆరోగ్య శాఖలో కొలువుల పండగ

**నేడు 1919 మందికి నియామక పత్రాల అందజేత**

**నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం..**

**ఉస్మానియా మెడికల్ కాలేజీలో భారీ కార్యక్రమం**

**హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, మే 11 :** అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు తీపి కబురు అందించింది. రాష్ట్ర ఆరోగ్య శాఖలో నూతనంగా ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం నియామక పత్రాలను అందజేయనుంది. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ భారీ బహిరంగ సభలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు ఆర్డర్లు అందజేస్తారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా అత్యంత పారదర్శక పద్ధతిలో ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఆరోగ్య శాఖలోని 1919 పోస్టులతో పాటు కార్మిక (లేబర్) శాఖలో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా ప్రభుత్వం భర్తీ చేస్తోంది. భారీ సంఖ్యలో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రాంగణంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ సౌకర్యంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ వసతులను మంత్రి స్వయంగా పర్యవేక్షించారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏళ్ల తరబడి వేధిస్తున్న సిబ్బంది కొరత తీరనుంది. నూతనంగా ఎంపికైన నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ నియామకాలు కీలకమని అధికారులు భావిస్తున్నారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివని, వారిని గౌరవించుకోవడానికే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



రోజే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర ఎంతో గొప్పదని, కొత్తగా విధుల్లో చేరేవారు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నియామక కార్యక్రమం ముగిసిన వెంటనే అభ్యర్థులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని అధికారులు సూచించారు.



## సంపాదకీయం

# రాజకీయ పార్టీల్లో 'సర్' భయాలు!

### బోగస్, డబుల్ ఓట్ల తొలగింపుపై పార్టీల్లో గుబులు

### ప్రక్రియపై అప్రమత్తమైన కాంగ్రెస్, బీఆర్ఎస్, వైసీపీ

**'స్పెషల్ ఇన్టెన్సివ్ రిజర్వేషన్' (సర్) ప్రక్రియ పేరు వినగానే రాజకీయ పార్టీల్లో ఆందోళన మొదలైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలో చేపట్టబోతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రక్రియ ద్వారా చనిపోయిన వారి పేర్లు, బోగస్ ఓట్లు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓట్లను గుర్తించి తొలగించనుండటంతో రాజకీయ పార్టీలు అప్రమత్తమవుతున్నాయి.**

ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ అమలైంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ నాయకులు, కార్యకర్తలకు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేస్తున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు హెచ్చరికలు పంపుతున్నాయి. అయితే ఓటర్ల జాబితా ప్రక్షాళన కొత్త విషయం కాదు. 1951 నుంచి 2004 వరకు దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక పరిశీలన కార్యక్రమాలు ఎనిమిది సార్లు నిర్వహించబడ్డాయి. కానీ 21 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రక్రియ చేపట్టడంతో రాజకీయ దుమారం చెలరేగుతోంది. గతంలో పెద్దగా వివాదాలు రాకపోయినా, ప్రస్తుతం మాత్రం ప్రతి చర్య రాజకీయ కోణంలోనే కనిపిస్తోంది. సర్ ప్రక్రియ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఆరోపణలు కొన్ని రాష్ట్రాల్లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం పూర్తిస్థాయి పరిశీలనతోనే చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత కీలకమైన హక్కు. ప్రజాస్వామ్యంలో ఓటరు నమోదవడం ఎంత ముఖ్యమో, అర్హత లేని ఓట్లు తొలగించడం కూడా అంతే అవసరం. చనిపోయిన వారి పేర్లు సంవత్సరాల తరబడి జాబితాలో కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం, ఇతర రాష్ట్రాల్లో కూడా పేర్లు ఉండటం వంటి సమస్యలు ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న ఉదాహరణలు అనేకం. రెండు విడతల ఎన్నికల సమయంలో రెండు చోట్ల ఓటు వేసిన ఘటనలూ వెలుగుచూశాయి. రాజకీయ పార్టీలు కూడా తమకు అనుకూలంగా బోగస్ ఓట్లను చేర్పించుకునేందుకు ప్రయత్నించాయన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. అందుకే ఇప్పుడు జరుగుతున్న పరిశీలనను కొందరు అవసరమైన సంస్కరణగా చూస్తున్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో అనుమానాస్పద ఓట్లను తొలగించినట్లు సమాచారం. చొరబాటుదారులు, అక్రమ వలసదారులు, నకిలీ పత్రాలతో నమోదైన ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో అక్కడ రాజకీయ వివాదాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆధార్, ఫోన్ నంబర్, బయోమెట్రిక్ వ్యవస్థలతో ఓటరు కార్డులను అనుసంధానం చేస్తే డబుల్ ఓట్లు, బోగస్ ఓట్లను సులభంగా అరికట్టవచ్చు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డులు ఆధార్‌తో లింక్ చేసినట్లే ఓటరు కార్డులను కూడా లింక్ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. అదేవిధంగా ఓటరు జీవించి ఉన్నాడని నిర్ధారించుకునే ఆన్‌లైన్ ధృవీకరణ విధానం తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, బయోమెట్రిక్ ఆధారిత ఓటింగ్ విధానం తీసుకువస్తే ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని భావిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగితే ఖచ్చితంగా ప్రశ్నించాలి. అదే సమయంలో బోగస్ ఓట్ల తొలగింపుకు కూడా సహకరించాలి. కానీ కొన్ని పార్టీలు మాత్రం తమ రాజకీయ ప్రయోజనాలకు దెబ్బ తగులుతుందనే భయంతో సర్ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి 'సర్' ప్రక్రియ ఇప్పుడు కేవలం ఓటర్ల జాబితా పరిశీలన మాత్రమే కాకుండా రాజకీయ వేడిని పెంచుతున్న కీలక అంశంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలంటే పారదర్శకమైన ఓటరు వ్యవస్థ అవసరం. అదే సమయంలో నిజమైన ఓటరికి అన్యాయం జరగకుండా చూడటం కూడా ఎన్నికల సంఘం ముందున్న అతిపెద్ద సవాల్‌గా మారింది.





# జూలై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' అమలు



- 125 రోజులకు పెరగనున్న పనిదినాలు
- 20 ఏళ్ల నాటి చట్టానికి కేంద్రం స్వస్తి

**న్యూఢిల్లీ, మే 11:** దేశంలోని గ్రామీణ ఉపాధి రంగంలో కేంద్ర ప్రభుత్వం భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. గత రెండు దశాబ్దాలుగా కోట్లాది కుటుంబాలకు ఆసరాగా ఉన్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని స్థానంలో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' పేరుతో సరికొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ నూతన వ్యవస్థ 2026, జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది.

### 125 రోజుల ఉపాధి గ్యారెంటీ

ప్రస్తుతం అమల్లో ఉన్న ఎంజీనరేగా పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి గరిష్ఠంగా 100 రోజుల పని కల్పిస్తుండగా, కొత్తగా రాబోతున్న 'వీబీ జీ రామ్ జీ' చట్టం ద్వారా ఆ పరిమితిని 125 రోజులకు పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పనిదినాలను పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్పులు చేసినట్లు కేంద్రం పేర్కొంది.

### తొలగనున్న ఈ-కేవైసీ చిక్కులు

పథకాల మార్పు సమయంలో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. ప్రస్తుతమున్న ఈ-కేవైసీ జాబ్ కార్డులే కొత్త కార్డులు వచ్చే వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరికైనా ఈ-కేవైసీ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నా, వారికి ఉపాధి కల్పించడంలో ఎలాంటి అడ్డంకులు ఉండవని భరోసా ఇచ్చింది. జూన్ 30, 2026 నాటికి ఎంజీనరేగా కింద కొనసాగుతున్న అన్ని ప్రాజెక్టులు జులై 1 నుంచి నేరుగా కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని, పనులు ఎక్కడా నిలిచిపోవని అధికారులు తెలిపారు.

### నిధుల కేటాయింపులో కొత్త విధానం

కొత్త చట్టం ప్రకారం నిధుల కేటాయింపులో కూడా మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈసారి ఉపాధి హామీ కోసం ఏకంగా రూ. 1.51 లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను అంచనా వేస్తున్నారు. అలాగే పనుల పర్యవేక్షణ కోసం జీపీఎస్ ట్రాకింగ్, రియల్ టైమ్ డ్యాష్ బోర్డులు వంటి అత్యాధునిక సాంకేతికతను వాడనున్నారు. పనుల ఎంపికలో కూడా జలవనరుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# భార్య భర్తకు బానిస కాదు..

- జంతువులా చూసే హక్కు లేదు
- ఆత్మగౌరవంతో బతికే హక్కు అందరికీ ఉంది
- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- గృహ హింస కేసులో నిందితుడి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ



**న్యూఢిల్లీ, మే 11 :** భార్య అంటే భర్తకు బానిస కాదని, ఆమెను జంతువులా చూసే హక్కు ఎవరికీ లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. వివాహ బంధంలో ఉన్నంత మాత్రాన మహిళ తన ఆత్మగౌరవాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదని, గౌరవంగా జీవించే హక్కు ఆమెకు ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. గృహ హింస కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఓ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పాట్నా హైకోర్టు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా అతనికి నిరాశే ఎదురైంది. నిందితుడు తన మొదటి భార్యపై మద్యం మత్తులో దాడి చేశాడని, ఆమెను నేలపైకి నెట్టివేయడంతో తలకు ఇటుక తగిలి తీవ్ర గాయమైందని ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. అంతేకాకుండా నిందితుడికి మొత్తం ముగ్గురు భార్యలు ఉన్నారని, బాధిత మహిళకు ఎటువంటి ఆర్థిక సాయం అందించడం లేదని తెలిపింది. అయితే, సదరు మహిళతో తనకు పెళ్లే కాలేదని నిందితుడు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది.

### మద్యం మత్తులో దాడులపై ఆందోళన

ఈ సందర్భంగా జస్టిస్ వరాలే స్పందిస్తూ.. భార్య పట్ల ఈ విధంగా క్రూరంగా ప్రవర్తించడాన్ని ఏమాత్రం సమర్థించలేమని మండిపడ్డారు. జస్టిస్ కుమార్ జోక్యం చేసుకుంటూ.. "మీరు భార్యను ఎందుకు కొట్టాలనుకుంటున్నారు? ఇలాగే కొడితే ఇప్పుడున్న భార్య కూడా మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది" అని నిందితుడిని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే గృహ హింస కేసుల్లో మద్యం సేవించి భార్యలపై దాడి చేయడం అనేది ఒక సాధారణ పద్ధతిగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ భర్తలు మద్యం తాగడాన్ని భరించినా, తాగిన తర్వాత చేసే దాడులను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అభిప్రాయపడ్డారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని పేర్కొంటూ, ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది.



# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

### ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం

### ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే 11:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# ఇంధన భద్రతపై రాజ్‌నాథ్ సింగ్ కీలక భేటీ

### నిత్యావసరాల కొరత రాకుండా చర్యలు

**న్యూఢిల్లీ, మే 11 :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దేశ ఇంధన భద్రత, నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి అప్రమత్తత ప్రకటించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సోమవారం 'అనధికార మంత్రుల బృందం' 5వ సమావేశం జరిగింది. గ్లోబల్ సప్లై చైన్ (ప్రపంచ సరఫరా గొలుసు) దెబ్బతినే ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, దేశీయంగా వస్తువుల లభ్యత మరియు ధరల నియంత్రణపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు. నిత్యావసరాల కొరత రాకుండా పటిష్ఠమైన ప్రణాళికలు సిద్ధం చేశామని, ప్రజలు అనవసరంగా వస్తువులను నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

### 60 రోజులకు సరిపడా నిల్వలు

గత ఏప్రిల్ 18న జరిగిన నాలుగో సమావేశంలో దేశంలో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా



పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నేటి ఐదో సమావేశంలో ఆ నిల్వలను మరింత పటిష్ఠం చేయడం, ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను కాపాడాలని నిర్ణయించారు. యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, దేశంలో ఉప్పు, పప్పు వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా నిరంతర నిఘా ఉంచుతున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

### సీఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ

**న్యూఢిల్లీ/ తిరువనంతపురం:** తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్
మంగళవారం
12 మే 2026

# సెలవుల్లో నైపుణ్యాలు పెంచుకోవాలి

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పుస్తకాలతో పాటు నైపుణ్యాలు, క్రీడలు, కళల్లో కూడా రాణించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ధరూర్ క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి శిబిరాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, జిల్లా విద్యాశాఖధికారి రాము, కౌన్సిలర్ బోయినిపెల్లి ప్రశాంత్ రావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆనంద్ రావు, ప్రసాద్ రావు, యాళ్ళ అమర్నాథ్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. శిబిరంలో యోగా, డ్రాయింగ్, కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



# కొండగట్టు గిరి ప్రదక్షిణకు సౌకర్యాలు కల్పిస్తాం



- పెద్ద హనుమాన్ జయంతికి అన్ని ఏర్పాట్లు
- కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు
- స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి లక్ష్మణ్ కుమార్
- పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ పూజారులు

**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని ఒప్పించి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంత్రి అడ్లూరి అంజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ పూజారులు మంత్రి కి పుర్ణకుంభ స్వాగతం పలికారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

### ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ

కొండగట్టు అంజన్న గిరి ప్రదక్షిణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని కలిసి నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరి ప్రదక్షిణ భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ, పోలీసు శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. భక్తులు సమన్వయం చేసుకొని ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకోవాలి మంత్రి అడ్లూరి సూచించారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై, తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. జిల్లా అధికారులు స్థానికంగా ఉండి భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



# బేటి బచావో...ఆడ బిడ్డకు అన్యాయం చేస్తావా

- కేంద్ర మంత్రిపై టి.జీవన్ రెడ్డి ఫైర్
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విమర్శ



**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** బేటి బచావో అని నినాదం చేస్తూ.. ఆడబిడ్డకు అన్యాయం చేసిన బండి సంజయ్ ను పక్కన కూర్చోపెట్టుని ప్రధాని మోదీ మాట్లాడటం ఆశ్చర్యకరం అన్నారు.బండి సంజయ్ తనయుడు భగీరత్ చేసిన నేరానికి 20 ఏళ్ల శిక్ష పడుతుంది. మైనర్ బాలిక సంఘటన పై కనీసం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ మంత్రిగా ఉండి పట్టించుకోవటంలేదు. నేరాన్ని కప్పిపుచే ప్రయత్నం చేసిన బండి సంజయ్ సైతం శిక్షార్హులు. బండి సంజయ్ బాధ్యత రాహిత్యం నైతికంగా మంత్రిగా కొనసాగే హక్కు లేదు.ఏ మాత్రం నైతిక విలువలు ఉన్న మంత్రి పదవికి రాజీనామా చేయాలి అని అన్నారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా ఎదిగిన నాయకుడిగా నీ కుటుంబాన్ని క్రమశిక్షణ నేర్పించలేనప్పుడు దేశానికి ఏం క్రమశిక్షణ నేర్పిస్తావు. వాస్తవాలు మాట్లాడితే కరీంనగర్ లో ఎమ్మెల్యే నివాసం పై దాడి చేయించావు ఇదేనా నీ క్రమశిక్షణ. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి బండి సంజయ్ ది ఫెవికల్ బంధం అన్నారు.రాష్ట్రంలో ఏ ఆడబిడ్డకు అన్యాయం జరిగిన న్యాయం జరిగే వరకు బీ ఆర్ ఎస్ పార్టీ అండగా నిలుస్తుంది. మోదీ అండ ఉందని,రేవంత్ రెడ్డి కళ్ళకు గంతలు కట్టుకున్నాడు. భగీరథ్ పై ఉద్దేశ పూర్వకముగా నేరానికి అనుగుణమైన సెక్షన్లు పెట్టకుండా తప్పించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ను సస్పెండ్ చేయాలి అన్నారు.ఆడబిడ్డ పై అఘాయిత్యం జరిగితే పీసీసీ కనీసం ఖండించలేదు అని అన్నారు.

# రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై 'షీ టీమ్' అవగాహన




- హెల్మెట్ లేని విద్యార్థులు, మహిళలకు కౌన్సెలింగ్
- టి. సురేష్ గౌడ్, జ్యోతి

**నేటి సాక్షి శంకర్‌పల్లి,( సుధాకర్ గౌడ్):** రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రతే లక్ష్యంగా శంకర్‌పల్లిలో సోమవారం లిటి. సురేష్ గౌడ్, జ్యోతి విద్యనాథ్ ఆధ్వర్యంలోలి 'షీ టీమ్' బృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శంకర్‌పల్లి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న విద్యార్థులకు ప్రయాణికులను ఆపి రోడ్డు భద్రత నియమాలపై షీ టీమ్ సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చారు. టి. సురేష్ గౌడ్ మాట్లాడుతూలి "యువత హెల్మెట్ లేకుండా బైక్ నడపడం ప్రాణాలకే ప్రమాదం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. ఒక నిమిషం నిర్లక్ష్యం జీవితాన్నే మార్చేస్తుంది" అని హెచ్చరించారు. జ్యోతి మహిళలతో మాట్లాడుతూలి "బ్యాంకు నుంచి అని ఫోన్ చేసి OTP. PIN అడిగితే ఎట్టిపరిస్థితుల్లో చెప్పొద్దు. ఉద్యోగాలు, లోన్ల పేరుతో వచ్చే ఫేక్ లింక్‌లు క్లిక్ చేయొద్దు. మోసపోయామని తెలిసిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి" అని సూచించారు. 1. రోడ్డు భద్రత: హెల్మెట్, కారులో సీటు బెల్టు తప్పనిసరి. మద్యం తాగి వాహనం నడపడం నేరం. 2. మహిళల భద్రత: ఆపదలో ఉన్న మహిళలు లిణఖ్రీ 100లి లేదా 1091 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. 3. నిబంధనలు పాటించని వారికి మొదటిసారి కౌన్సెలింగ్ ఇచ్చి, మళ్లీ దొరికితే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


## సర్పంచు ఆనంద్ మోత్కూర్



**నేటి సాక్షి, దోమ (సురేష్ మోత్కూర్ ):** మోత్కూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ 37 వేల రూపాయలు వన్నె కారి అమరేష్ గారి తల్లి సులోచన గారికి శాసనసభ్యులు రామ్ మోహన్ రెడ్డి సహకారంతో ఈరోజు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక సర్పంచ్ ఆనంద్ కుమార్, ఉద్యోగ సంఘం అధ్యక్షులు రామకృష్ణదనేశ్వర్ అందజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్ర సారంగీ వార్డ్ మెంబర్ సంపెల్లి చెన్నయ్య గాయత్రి సంపెల్లి మల్లేష్ సీనియర్ నాయకులు గుండెమళ్ళ మొగిలయ్య ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# రాంమోహన్ రెడ్డి నాకు దేవుడు

## బడేంపల్లి నరేష్.



**నేటి సాక్షి, దోమ (సురేష్ మోత్కూర్):** పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి గారికి ధన్యవాదాలు. నేను కష్ట కాలంలో ఉన్న ప్రతిసారి నన్ను ఆదుకుంటూ వచ్చిన దేవుడు ఎమ్మెల్యే మొన్న తాండూరులో మా భార్య డెలివరీ కోసం వచ్చాము. అక్కడ బ్లడ్ గ్రూపు కావాలి తీసుకురావాలి అన్నారు తీసుకురా పో అని చెప్పారు డాక్టర్స్. కానీ పాత తాండూర్ హాస్పిటల్లో ఒక అతను బ్లడ్ ఇవ్వను అన్నాడు. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు?ఒకపక్క మా భార్య కండిషన్ సీరియస్ గా ఉంది.మరో పక్క బ్లడ్ ఇవ్వడం లేదు. అప్పుడు మా ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డికి ఫోన్ చేస్తా అని చెప్పగానే, అప్పుడు అతను బ్లడ్ గ్రూప్ ఇవ్వడం జరిగింది. తర్వాత మళ్లీ మా ఎమ్మెల్యే సార్ నాకు వాట్సాప్ లో మెసేజ్ పెట్టడం జరిగింది.ఏమైందమ్మా నరేష్ అని అడగడం జరిగింది. ఇలా జరిగింది సార్ అని వివరించడం జరిగింది. వీలున్నప్పుడు మళ్ళీ ఫోన్ చేస్తా నరేష చెప్పడం జరిగింది. నన్ను గుర్తుపెట్టుకుని మరి ఎమ్మెల్యే స్థాయిలో ఉండి కూడా ఒక సాధారణ వ్యక్తిగానేను ఉన్న నాకు ఫోన్ చేసి మరి ఇప్పుడు ఏమైంది నరేష్ అని చెప్పి వివరణ కోరడం జరిగింది. మా ఎమ్మెల్యే సార్ గారికి నా జీవితాంతం రుణపడి ఉంటాను థాంక్యూ సార్. ఇలాంటి గొప్ప వ్యక్తికి దగ్గరవ్వడం నా అదృష్టం.అని సంతోష పడ్డాడునరేష్.

# బండి రమేష్‌ను కలిసిన కమ్మ సంఘం నాయకులు



**నేటి సాక్షి కూకట్పల్లి:** కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్ కి అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీ నగర్ కమ్మ సంఘంతో పాటు ఈసీఐఎల్ కమ్మ సంఘం నాయకులు ఆదివారం బండి రమేష్ నీ, నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్లో కలిసి పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. అభినందనలు తెలియజేశారు. బాలాజీ నగర్‌లో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో పాదయాత్ర నిర్వహిస్తానని రమేష్ గారు తెలిపారు.

# నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో పీఎం జిల్లా పరిషత్ పాఠశాలలో నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే పద్మావతి తెలిపారు. చిలుకూరులోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.40.5 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆమె ప్రారంభించారు. త్వరలోనే విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్లను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగయ్య. ఎంపీడీవో నరసింహారావు కార్యదర్శి షరుబుద్దిన్, ఎంఈవో నరసింహారెడ్డి, HM రాజారావు ఉపాధ్యాయులు. కాంగ్రెస్ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ సోందుమియా గంగిరెడ్డి నాగిరెడ్డి పుల్లారావు కోళ్ల గురుస్వామి సైదిరెడ్డి గ్రామ పెద్దలు. పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోకుంటే దీక్ష

- చర్యలు తీసుకోకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష.
- సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ హెచ్చరిక



**నేటి సాక్షి.మునగాల:** ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని నరసింహాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణకు వినతిపత్రం సమర్పించి అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల కోసం గతంలో కేటాయించిన ప్రభుత్వ భూముల్లో మిగిలిన ఖాళీ స్థలాలు, ప్లాట్లను కొందరు బహిరంగంగానే ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. పలుమార్లు ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగానే భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను వెంటనే సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని, లేకపోతే మరిన్ని భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఈ భూములు ఉపయోగపడతాయని, అధికారులు ఇప్పటికైనా మేల్కొనాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ముస్లిం మతస్తులకు చెందిన కబరస్తాన్ భూమి కూడా ఆక్రమణ ముప్పులో ఉందని, దానిని కూడా సర్వే చేసి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతానని తహసీల్దార్ సమక్షంలోనే ఆర్డీవోకు స్పష్టం చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్డీవో సూర్యనారాయణ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

# తల్లులందరికీ హ్యాపీ మదర్స్ డే శుభాకాంక్షలు





**అమ్మకు నా అక్షర నీరాజనం**

**పదాలు తెలియని పెదవులకు అమృత వాక్యం అమ్మ - చల్లని ఒడిలో మొదలైంది ఈ జన్మ:-సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు**



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ప్రపంచ తల్లుల దినోత్సవం సందర్భంగా తన భార్య టేకూరి.రేణుక, కుమారులు టేకూరి.యువ, టేకూరి.కుందన్, బంధుమిత్రులతో కలిసి భారీ కేక్ ను కటింగ్ చేసి, తన తల్లి అయిన మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ కు తినిపించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సమాజ సేవకుడు & వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అమ్మ.. పేరులో ప్రేమని.. అమ్మ పిలుపులో మాధుర్యాన్ని నింపుకున్న అమృత మూర్తి అమ్మ అని అన్నారు. అంత గొప్ప మానవత్వం ఉన్న అమ్మ, అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే అని, అమ్మను ఎంత పొగిడినా తక్కువే అన్నారు. త్యాగమూ, ప్రేమా కలిస్తే అందులో నుంచి అమ్మే పుట్టుకొస్తుందనీ, అమ్మకు ప్రత్యామ్నాయం లేదనీ, అమ్మ ఉన్న చోట అదృష్టం పురి విప్పి ఆడుతుందన్నారు. ప్రతి ఒక్కరికి "అమ్మ లేకపోతే జననం లేదనీ, అమ్మ లేకపోతే గమనం లేదనీ, అమ్మ లేకపోతే సృష్టిలో జీవం లేదనీ, అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు".. కంటిపాపలా కాపాడే అమ్మకి ' మదర్స్ డే శుభాకాంక్షలు అన్నారు. "కార్యేషు దాసి.. కరణేశు మంత్రి.. భోజ్యేసు మాత.. ఇలా సమస్తం నీవే". ఓ మాతృ మూర్తి.. 'మదర్స్ డే' సందర్భంగా మీ కిదే మా వందనం అంటూ నినాదాలు చేశారు. పిల్లలు కనులు తెరిచిన క్షణం నుంచి బంధం కోసం బాధ్యత కోసం, కుటుంబం కోసం అందర్నీ కనుపాపలుగా చూసుకుంటూ, ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టించి, వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి, తన ఇంటిని నందనవనం చేసే అమ్మకు...పాదాభివందనం చేస్తూ -హ్యాపీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నం కలిపి గోరు ముద్దలు పెట్టేటప్పుడు తనకు బిడ్డపై ఉన్న ప్రేమను కూడా కలిపి తన పిల్లలకు పెడుతుందన్నారు. ఆ బిడ్డ ఎంతో ఇష్టంగా ఆ అమ్మ తయారుచేసిన ముద్దలు తింటుంటే... ఆ బిడ్డ కడుపు నిండుతుందో లేదో కానీ, ఆ తల్లి కడుపు ఆనందంతో నిండిపోతుందన్నారు. అమ్మ ఒక కావ్యం కల్మషం లేని నవ్వు అమ్మ,నిర్మలమైన మమతల కోవెల అని అమ్మ,కష్టాన్ని దాచుకుని, నవ్వును పంచే అమ్మ,నా ప్రాణానికి ఊపిరి అని నా అమ్మ!కంటిపాపలా కాపాడే కవచం అని, అమ్మ,లోకం రుచి చూపిన మొదటి గురువు అని అమ్మ, ఏడవడానికి అయినా, తలదాచుకోవడానికి అయినా,అమ్మ ఒడిని మించిన స్వర్గం లేదనీ అన్నారు. ఈ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తల్లులందరికీ వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు పేరుపేరునా హ్యాపీ మదర్స్ డే శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ నాగేశ్వరరావు యువ సైన్యం, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# మునగాలలో మహిళల బ్యూటీ సెలూన్ ప్రారంభం



**నేటి సాక్షి, మునగాల:** మునగాల మండల కేంద్రంలో గ్రామీణ మహిళలకు శుభకార్యాలు, వివాహాలు, ప్రత్యేక వేడుకల సందర్భంగా నాణ్యమైన బ్యూటీ సేవలు అందించేందుకు నూతన మహిళా బ్యూటీ షాలూన్‌ను సోమవారం ప్రారంభించారు. మునగాల పోలీస్ స్టేషన్ ఎస్సై బి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షాలూన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడం అభినందనీయమని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని తెలిపారు. శుభకార్యాలు, పెళ్లిళ్లు, వేడుకలకు అవసరమైన మేకప్, హెయిర్ స్టైలింగ్ తదితర సేవలను ఈ సెలూన్‌లో అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువతులు, ప్రముఖులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# జీవో 17ను వెంటనే రద్దు చేయాలి



**ఎమ్మెల్యే బీఎంపీ జిల్లా అధ్యక్షులు గట్ట్యా నాయక్**

**నేటి సాక్షి, పరిగి(సురేష్ మోత్కూర్):** వికారాబాద్ జిల్లా కేంద్రం లో కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున్న నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది మరియు కలెక్టర్ గారికి వినతి పత్రం కూడా ఇవ్వడడం జరిగింది. SC. ST. దీజ, మైనార్టీలకు రాజ్యంగా బద్ధంగా రావాల్సిన హక్కులను వెంటనే ఇవ్వాలి.రేవంత్ రెడ్డి చేవెళ్ళలో ప్రకటించిన SC.ST డిక్లరేషన్‌ను వెంటనే ప్రకటించాలి.కామారెడ్డి లో దీజ లకు ప్రకటించిన డిక్లరేషన్లను వెంటనే నెరవేర్చాలి.అన్ని టెండర్ వ్యవస్థలో గత ప్రభుత్వం పరిపాలన లో కల్పించిన రిజర్వేషన్స్ రాజ,రా,దీజ, మైనార్టీ లకు ఇవ్వకుండా రేవంత్ రెడ్డి డిక్లరేషన్ ప్రకటించి కూడా రిజర్వేషన్స్ ఇవ్వకూడా SC.ST.BC, మైనార్టీ లకు మోసం చేస్తున్నాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచన్ పల్లి ఆనంద్,బీఎంపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నేనావత్ హరి నాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ కార్యదర్శి భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్, మాజీ సర్పంచ్ జగన్, గొరబంజారా హక్కుల సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేరేందర్ నాయక్, విజయ్,ఎస్సి ఎస్టి బీసీ మైనారిటీ ప్రజా సంఘాల నాయకులు, యూవకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

**నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కే ప్రశాంత్ కుమార్ రెడ్డి...**



**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలంలోని తీలేరు గ్రామంలో ప్రభుత్వ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ భద్రప్ప, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, సునీత, వెంకట్ రెడ్డి, రాములు, రాము, హన్మి రెడ్డి , వెంకట్ రెడ్డి, కురుమన్న, కుమ్మరి రాజు, రవి, రామ్చంద్రి, చంద్రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు పలు పంటలపై శాస్త్రవేత్తల ఆధ్వర్యం లో అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు పంటలపై పూర్తిస్థాయిలో రైతులకు పంటల దిగుబడి పై వివరించారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ శాఖ అధికారి రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

# బుడ్డగాని తండాలో చురుగ్గా అభివృద్ధి పనులు

**గ్రామ సర్పంచ్ బాలు రాథోడ్....**





**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని బుడ్డా గాని తండాలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు గ్రామ సర్పంచ్ బాలు రాథోడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. గ్రామంలోని పలు వార్డులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు, ఇట్టి పనులకుగాను గ్రామపంచాయతీ నిధులు రూ, 8 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని సర్పంచ్ వివరించారు.

# ఉచిత ఆధార్ సెంటర్

**ప్రారంభించిన కౌన్సిలర్ రాజండ్ల వసంత మహేందర్ రెడ్డి**



**నేటి సాక్షి, శంకర్ పల్లి :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపూర్ 10 వార్డ్ లో కౌన్సిలర్ తన వార్డ్ ప్రజలు ఆధార్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని తన స్వంత ఖర్చుతో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రారంభించారు, ఈసందర్బంగా మాట్లాడుతు ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు, వార్డ్ పరిధిలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో తానే స్వంత ఖర్చుతో ఈ ఆధార్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు తన వార్డ్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, 10 వార్డ్ కౌన్సిలర్ లాగానే శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని మిగతా కౌన్సిలర్లు కూడా ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ లోని వివిధ వార్డ్ ప్రజలు కోరుతూన్నారు



# ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లకు బీసీసీఐ హెచ్చరిక

ముంబై, మే 11 : ఐపీఎల్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న వేళ, ఫ్రాంచైజీ యజమానుల వ్యవహారశైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డు జారీ చేసిన నిబంధనలను కొందరు జట్టు యజమానులు పట్టించుకోవడం లేదని గుర్తించిన బీసీసీఐ, ఇకపై రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవల అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలు పంపించారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో జట్టు యజమానులు ప్లేయింగ్ ఏరియాలోకి రావద్దని, ఆటగాళ్లు లేదా సపోర్ట్ స్టాఫ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడకూడదని స్పష్టంగా ఆదేశించారు. అయితే కొందరు యజమానులు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు బోర్డు గుర్తించింది. ఐపీఎల్‌కు చెందిన ఓ అధికారి మాట్లాడుతూ.. "ఫ్రాంచైజీ ఓనర్లకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. కొందరు డగౌట్ సమీపంలో తిరుగుతూ కనిపించారు. మరికొందరు మొబైల్ ఫోన్లతో మైదానంలోకి వచ్చి ఫొటోలు కూడా తీశారు. దీనికి సంబంధించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. పలుమార్లు హెచ్చరించినా మార్పు కనిపించకపోవడంతో ఇకపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని తెలిపారు. ఇక మరోవైపు ఐపీఎల్ 2026 సీజన్‌లో 'హనీ ట్రాప్' ప్రమాదాలపై కూడా బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను అప్రమత్తం చేసింది. ఆటగాళ్లు లేదా అధికారులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. హై ప్రొఫైల్ క్రీడా వాతావరణాల్లో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన బీసీసీఐ, హోటళ్లలో తనిఖీలు కూడా నిర్వహిస్తోంది. ఆటగాళ్ల గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించినట్లు తేలితే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బోర్డు హెచ్చరించింది.



# వినేశ్ ఫొగట్ వివాదం మళ్లీ హాట్‌టాపిక్

అయోధ్య, మే 11 : భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు సంబంధించిన వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనేందుకు ఆమె అయోధ్యకు చేరుకున్నప్పటికీ, భారత రెజ్లింగ్ సమాఖ్య నుంచి అనుమతి లభించలేదు. రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత మళ్లీ పోటీల్లో పాల్గొనాలంటే కనీసం ఆరు నెలల విరామం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ నియమం ప్రకారం వినేశ్ ప్రస్తుతం అర్హురాలు కాదని భారత రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. జూన్ 26 వరకు దేశీయ టోర్నీల్లో ఆమె పాల్గొనలేరని గతంలోనే షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. అయితే తాను తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అర్హురాలినేనని వినేశ్ ఫొగట్ పేర్కొంది. ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ నిబంధనల ప్రకారం యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌కు ముందుగానే తన రీఎంట్రీ విషయాన్ని తెలియజేశానని ఆమె వెల్లడించింది. గత జూన్‌లోనే ఈ సమాచారం అందించినట్లు తెలిపింది. రిటైర్మెంట్ తర్వాత తిరిగి బరిలోకి దిగాలనుకునే క్రీడాకారులు కనీసం ఆరు నెలల ముందే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే వినేశ్ ఇచ్చిన వివరణతో రెజ్లింగ్ సమాఖ్య సంతృప్తి చెందలేదు. అర్హత అంశంపై మాత్రమే ఆమె స్పందించిందని, క్రమశిక్షణా చర్యలపై సరైన వివరణ ఇవ్వలేదని సమాఖ్య పేర్కొంది. జాతీయ టోర్నీలో పాల్గొనే మహిళా రెజ్లర్లకు సోమవారం సాయంత్రం వెయిట్ చెకింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నీలో విజేతలుగా నిలిచిన వారికి ప్రపంచ ఛాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం లభించనుంది.

# పరుగుల సునామీలో ఢిల్లీదే గెలుపు!



**అక్షర్, మిల్లర్ మెరుపులు.. పంజాబ్‌పై 3 వికెట్ల తేడాతో విజయం**

**ఒకే ఓవర్ మిగిలి ఉండగానే 211 పరుగుల భారీ లక్ష్య ఛేదన**

**శ్రేయస్ అయ్యర్, ప్రియాంశ్ ఆర్యల అర్ధశతకాలు వృథా**

**ధర్మశాల :** ఐ పీ ఎల్ లో భాగంగా సోమవారం ధర్మశాలలోని హెచ్ పీ సీ ఏ (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్) స్టేడియం వేదికగా జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్ లో పంజాబ్ కింగ్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీ సీ) అద్భుత విజయం సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ బ్యాటర్లు సమష్టిగా పోరాడి మరో 6 బంతులు (ఒక ఓవర్) మిగిలి ఉండగానే 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు సాధించి ఘనవిజయాన్ని అందుకున్నారు. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ ల విధ్వంసక అర్ధశతకాలతో పాటు చివర్లో అశుతోష్ శర్మ మెరుపులు ఢిల్లీకి అద్భుత గెలుపును అందించాయి. ఈ పరాజయంతో తొలుత బ్యాటింగ్ లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ కు తీవ్ర నిరాశే మిగిలింది. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, యువ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యల అద్భుత ఇన్నింగ్స్ లు వృథా అయ్యాయి.

## శ్రేయస్, ప్రియాంశ్ జోరు.. పంజాబ్ భారీ స్కోరు..

టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 33 బంతుల్లోనే 56 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీలుచిక్కినప్పుడల్లా భారీ షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అయ్యర్ 36 బంతుల్లోనే అజేయంగా 59 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. వీరికి తోడుగా కూపర్ కొన్నోల్లీ 27 బంతుల్లో 38 పరుగులు సాధించి అద్భుత సహకారం అందించాడు. దీంతో పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మాధవ్ తివారీ 40 పరుగులిచ్చి 2 వికెట్లు, మిచెల్ స్టార్క్ 57 పరుగులిచ్చి 2 వికెట్లు, ముకేష్ కుమార్ 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు. స్టార్క్ భారీగా పరుగులు సమర్పించుకోవడం ఢిల్లీకి ప్రతికూలంగా మారింది.

## అక్షర్, మిల్లర్ విధ్వంసం.. లక్ష్య ఛేదన..

211 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు ఆరంభంలోనే పంజాబ్ బౌలర్లు సవాలు విసిరారు. పంజాబ్ పేసర్ అర్ష్ దీప్ సింగ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి 21 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, యశ్ ఠాకూర్ 55 పరుగులిచ్చి 2 వికెట్లు, మార్కస్ స్టోయినిస్ 44 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టారు. వికెట్లు పడుతున్నా ఢిల్లీ బ్యాటర్లు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ముఖ్యంగా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ లు క్రీజులో కుదురుకుని పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. మైదానం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లు బాదుతూ లక్ష్యాన్ని కరిగించారు. అక్షర్ పటేల్ 30 బంతుల్లోనే 56 పరుగులు సాధించగా, డేవిడ్ మిల్లర్ కేవలం 28 బంతుల్లోనే 51 పరుగులు చేసి మ్యాచ్ ను ఢిల్లీ వైపు తిప్పారు. వీరిద్దరూ అవుటైన తర్వాత మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారినప్పటికీ.. చివర్లో క్రీజులోకి వచ్చిన అశుతోష్ శర్మ కేవలం 10 బంతుల్లోనే 24 పరుగులు బాది పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు సాధించి, మరో 6 బంతులు మిగిలి ఉండగానే 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.







# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానం




**దుబాయ్, మే 11 :** అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన తాజా వన్డే వార్షిక ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 118 రేటింగ్ పాయింట్లతో టీమిండియా మొదటి స్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇప్పటికే టీ20 ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానంలో ఉన్న భారత్, వన్డే ఫార్మాట్‌లోనూ తన జోరు కొనసాగిస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026లో విజయం సాధించిన అనంతరం భారత జట్టు పొట్టి ఫార్మాట్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో ఘన విజయం సాధించడం ద్వారా వన్డేల్లోనూ తన బలాన్ని నిరూపించింది. తాజా ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. భారత్‌తో కేవలం ఐదు పాయింట్ల తేడా మాత్రమే ఉండటం విశేషం. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇటీవల అద్భుత ప్రదర్శనలతో వరుస విజయాలు నమోదు చేసిన దక్షిణాఫ్రికా 102 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టింది. పాకిస్థాన్ ప్రస్తుతం 98 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీలంక 96 పాయింట్లతో ఆరో స్థానంలో, అఫ్గానిస్థాన్ 93 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతున్నాయి. ఇంగ్లండ్ 89, బంగ్లాదేశ్ 84, వెస్టిండీస్ 74 పాయింట్లతో టాప్-10లో తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి. ఇక ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానానికి పడిపోయింది. అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకగా, స్కాట్లాండ్ 44 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచింది. ఐసీసీ నిబంధనల ప్రకారం 2027 మార్చి 31 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచే జట్లు నేరుగా వన్డే ప్రపంచకప్ 2027కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి అర్హత పొందాయి. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా టాప్-8లో కొనసాగితే, తొమ్మిదో స్థానంలో నిలిచే జట్టుకూ ప్రత్యక్ష అర్హత లభించే అవకాశం ఉండటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.




# విజయ్ క్రేజ్ చూసి షాక్ అయ్యాను..

## ప్రియాంక చోప్రా పాత వ్యాఖ్యలు వైరల్!

**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరుణంలో, ఆయన సినీ ప్రస్థానానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నటి ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం విజయ్ సరసన ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తొలి సినిమా హీరో గురించి ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. 2002లో విడుదలైన 'తమిళన్' సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. అప్పటి తన అనుభవాలను గుర్తు చేసుకుంటూ.. "నాకు అప్పట్లో తమిళం అస్సలు తెలియదు, డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టేదాన్ని. షూటింగ్ సెట్ అంటే ఎలా ఉంటుందో కూడా తెలియని తరుణంలో విజయ్ నాకు ఎంతో సహకరించారు. అయితే షూటింగ్ సమయంలో ఆయనకున్న అభిమాన గణాన్ని చూసి నేను పూర్తిగా షాక్ అయ్యాను. వందలాది మంది ఫ్యాన్స్ సెట్స్ దగ్గరకు వచ్చి ఆయన్ను చూసే విధానం, ఆరాధించే తీరు చూస్తే.. ప్రజలు ఆయన్ను ఒక దేవుడిలా చూస్తున్నారని నాకు అనిపించింది" అని ప్రియాంక పేర్కొన్నారు. ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా కూడా గతంలో విజయ్ వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. "విజయ్ తన కూతురిని ఎంతో గౌరవంగా చూసుకునేవారని, స్టార్ హీరో అనే గర్వం లేకుండా కొత్త హీరోయిన్‌కు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారని" ఆమె తెలిపారు. మొదట్లో విజయ్‌తో సమానంగా డ్యాన్స్ చేయడం ప్రియాంకకు సవాలుగా అనిపించినా, ఆయన సహకారంతోనే అది సాధ్యమైందని చెప్పారు. 'తమిళన్' సినిమా ఇచ్చిన స్ఫూర్తే ప్రియాంకను నటనను ఒక కెరీర్‌గా ఎంచుకునేలా చేసిందని ఆమె వెల్లడించారు. నాడు ఒక సామాన్య నటిగా విజయ్ మేనరిజమ్స్ చూసి ఆశ్చర్యపోయిన ప్రియాంక, నేడు ఆయన ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదగడంపై సినీ ప్రముఖులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాటి ఆమె మాటలు ఇప్పుడు విజయ్ రాజకీయ ఎదుగుదలకు సరిగ్గా సరిపోతాయని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.



# విశ్వంభరపై భారీ అంచనాలు

## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు



మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



# నేను బీజేపీకి సపోర్ట్ చేస్తా.. రేపిస్టులకు కాదు..

## యాంకర్ రష్మీ గౌతమ్ సంచలన పోస్ట్




కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ సాయిపై పోక్సో కేసు వ్యవహారంపై యాంకర్ రష్మీ గౌతమి సంచలన పోస్టు చేశారు. తాను బీజేపీకి మద్దతిస్తానని.. అయితే లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని రష్మి స్పష్టం చేశారు. యాంకర్ రష్మీ గురించి స్పెషల్ ఇంట్రడక్షన్ అవసరం లేదు. సోషల్ మీడియాలో ఎప్పుడూ బీజేపీకి అనుకూలంగా పోస్టులు పెడుతుంటారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు విషయంలో పలువురు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రష్మి ఎక్స్ వేదికగా స్పందించారు. "నేను బీజేపీకి మద్దతు ఇస్తాను కానీ.. రేపిస్టులకు, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని" ఆమె పేర్కొన్నారు. తాను సమస్యలపై కేవలం సానుభూతి చూపగలనని, పోరాడేంత శక్తి తనకు లేదన్నారు.

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

## నటి త్రిష ఆసక్తికర పోస్ట్

ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాప్షన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

## ఎస్ఐ ని సన్మానించి ఎమ్మార్పిఎస్ సీపీఐ నాయకులు



**నేటిసాక్షి, నల్లబెల్లి:** ఇటీవల నూతనంగా నల్లబెల్లి ఎస్ఐ గ బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసన్న కుమార్‌ను కలిసి ఎమర్పిఎస్, సీపీఐ నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా దళిత రత్న అవార్డు గ్రహీత ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు పరికిరత్నం మాదిగ సీపీఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడుతూ... సమాజంలో ఉన్నటువంటి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నీతి నియమాలతో కర్తవ్య బోధనతో విధులు నిర్వర్తించి మండలానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సంబంధించిన సమస్యలను సావధానంతో పరిష్కరించి సమాజంలో అందరూ సమానమే అనేది దృక్పధం కలిగించుటకు నిరంతరం శ్రమించాలని సమాజంలో ఉన్నటువంటి నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందించలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల మండల సహాయ కార్యదర్శి కందిక రమేష్. రైతు సంఘం మండల కార్యదర్శి ఐలయ్య, మేర సంఘం మండల అధ్యక్షులు ఓదెల రవి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పరికి కోర్నెల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఉమారాణికి నివాళులు అర్పించిన జువ్వాడి కృష్ణారావు

**రాచమడుగు శ్రీనివాస్‌రావు మాతృమూర్తి మృతి పట్ల సంతాపం**



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణానికి చెందిన రాచమడుగు శ్రీనివాస్‌రావు మాతృమూర్తి శ్రీమతి ఉమారాణి మృతి చెందగా, ఆమె పార్థివదేహానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు నివాళులు అర్పించారు. పట్టణంలోని మృతురాలి స్వగృహానికి వెళ్లిన ఆయన పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఏడుగురు అదుపులోకి.. నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం**



**నేటి సాక్షి , కోరుట్ల (రాధారపు నర్సయ్య):** ఆదివారం రాత్రి కోరుట్ల పట్టణంలోని జమ్మిగద్దె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుండి రూ.8,500 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, తొమ్మిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న మొత్తం పదిమంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడిలో పోలీస్ స్టేషన్ సిబ్బంది శివాజీ, ఎల్లయ్య, గంగాధర్, రామకోటి పాల్గొన్నారు. పట్టణంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, పేకాట, గంజాయి, ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు.

## శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్న ధన్వాడ గ్రామస్తులు

**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రానికి చెందిన ప్రజలు శ్రీ శ్రీ శ్రీ ఉమామహేశ్వర స్వామిని వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ధన్వాడ గ్రామస్తులు, ఉమామహేశ్వర స్వామి భక్తులు సోమవారం నాడు నారాయణపేట జిల్లా “నేటి సాక్షి” రిపోర్టర్ కు తెలిపారు.



# భగీరథ్ పై పోక్సో కేసును పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వాలు

- వెంటనే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- బీఎస్పీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి కత్తుల కాన్షీరామ్




**నేటిసాక్షి, నల్లగొండ :** కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బంటి సంజయ్ కుమారుడు భగీరథ్ పై నమోదైన పోక్సో కేసును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని బీఎస్పీ పార్టీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ప్రజల నుంచే పుట్టిన ప్రభుత్వం, ప్రజల చేత నడిచే ప్రభుత్వం, ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం” అని చెప్పుకుంటున్న బీజేపి పార్టీ నాయకులు, ఈరోజు సమాజానికి ఏ విధమైన సందేశం ఇస్తున్నారు అనేది దేశ ప్రజలు గమనిస్తున్నారని, దేశంలో చట్టాలను అమలు చేయాల్సిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై 17 ఏళ్ల మైనర్ బాలికకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు, పోక్సో కేసు నమోదు కావడం అత్యంత ఆందోళనకర విషయం అని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ బాలికను మానసికంగా, శారీరకంగా వాడుకోవడం, మద్యం తాగించి ప్రభావితం చేయడం, అధికార అహంకారంతో వ్యవహరించడం వంటి ఆరోపణలు బయటకు రావడం సమాజం తలదించుకునే పరిస్థితి ఉందని, చట్టం ముందు అందరూ సమానమే అయితే, అధికారంలో ఉన్న వారి కుటుంబాలకు ప్రత్యేక రక్షణ ఎందుకు? అనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోందని, ఈ కేసులో ఇప్పటికే పోక్సో చట్టం మరియు సంబంధిత IPC□BNS సెక్షన్లు నమోదు చేసిన నేపథ్యంలో, ప్రభుత్వం ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మైనర్ బాలికపై మద్యం మత్తులో లైంగిక దాడి జరిగి ఉంటే, ఇప్పటికే నమోదైన సెక్షన్లతో పాటు పోక్సో చట్టం 5 & 6 .ual Assault.. BNS Sections 64, 65, 74, 75, 76, 127(2), 351(2) వంటి కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అవసరమైతే జీవిత ఖైదు పడే విధంగా నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. డబ్బు, పదవి, అధికారంతో చట్టం మారకూడదని, బాధితురాలు ఎవరి కూతురైనా సరే, న్యాయం మాత్రం ఒకటే కావాలని,ప్రభుత్వం ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, మైనర్ బాలికకు పూర్తి భద్రత, వైద్య పరీక్షలు, మానసిక సహాయం, న్యాయ సహాయం కల్పించాలని, ఆమె ఆరోగ్యం పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని అన్నారు. అలాగే “హనీ ట్రాప్” అంటూ రివర్స్ కంప్లైంట్ ఇవ్వడం ద్వారా అసలు అంశాన్ని పక్కదారి మళ్లించే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని, ప్రపంచ స్థాయి ప్రముఖులు, పెద్ద రాజకీయ లేదా ఆర్థిక ప్రయోజనాల నేపథ్యంలో జరిగే కుట్రలను “హనీ ట్రాప్” అంటారు గాని, ఒక మైనర్ బాలిక చేసిన ఫిర్యాదును తక్కువ చేసి చూపేందుకు అలాంటి పదజాలాన్ని ఉపయోగించడం సిగ్గుచేటని అన్నారు. డబ్బు, పదవి, అధికార మదంతో చట్టాలను కూడా తేలికగా తీసుకుంటున్న ఇటువంటి వ్యక్తులు సమాజంలో స్వేచ్ఛగా తిరిగితే భవిష్యత్‌లో మరిన్ని అమాయక బాలికల జీవితాలు నాశనం అయ్యే ప్రమాదం ఉందని, అందుకే ఈ కేసులో నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే జీవిత ఖైదు విధించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతకు ఘన నివాళి







- స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు 6వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహణ
- కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జువ్వాడి బ్రదర్స్
- మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహణ

**నేటి సాక్షి, కోరుట్ల ( రాధారపు నర్సయ్య):** ప్రజల కోసం జీవించి ప్రజల కోసమే చివరి శ్వాస వరకు ఆలోచించిన మహానేత.. పదవులకు గౌరవం తెచ్చిన ప్రజాసేవకుడు.. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.. అదే స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు..! ఆయన భౌతికంగా దూరమైనా ప్రజల హృదయాల్లో మాత్రం చిరంజీవిగా నిలిచిపోయారు..! ఆ మహానేత సేవలను స్మరించుకుంటూ కోరుట్ల పట్టణంలో 6వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.‘జువ్వాడి బ్రదర్ ’తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి, ప్రజాసేవలను గుర్తు చేసుకుంటూ నేతలు భావోద్వేగానికి గురయ్యారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ‘ప్రజాసేవే మా కుటుంబ ధ్యేయం’ అంటూ జువ్వాడి బ్రదర్స్ మరోసారి స్పష్టం చేశారు.

### రత్నాకర్ రావు విగ్రహానికి ఘన నివాళులు

కోరుట్ల పట్టణ వెటర్నరీ కళాశాల వద్ద గల స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు కాంస్య విగ్రహం వద్ద ఆయన 6వ వర్ధంతి వేడుకలను కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వేలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

### కోరుట్ల ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గ ప్రజల హృదయాల్లో స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు చిరస్మరణీయులుగా నిలిచిపోయిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కోరుట్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే అది రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి వల్లేనని, గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కోరుట్ల పట్టణ ఆటో చివరన మెట్‌పల్లి రోడ్డులో వెటర్నరీ కళాశాల, జగిత్యాల రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల తీసుకువచ్చిన ఘనత రత్నాకర్ రావుదేనని గుర్తు చేశారు.

### 4500 డబుల్ ఇండ్లకు కృషి చేసిన నాయకుడు

రత్నాకర్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కోరుట్ల పట్టణానికి సుమారు 4500 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయించి మాదాపూర్ కాలనీ, అర్బన్ కాలనీ, ఏసుకొని గుట్ట, అల్లమయ్య గుట్ట వంటి కాలనీలు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. గడచిన పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మాత్రం కేవలం 80 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మాత్రమే నిర్మించారని, అవి కూడా అర్హులైన పేదలకు కాకుండా తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే అప్పగించారని విమర్శించారు.

### కాంగ్రెస్ సంక్షేమ పథకాల అమలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని నాయకులు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డుల మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు కడుపునిండా తినాలనే సంకల్పంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

### 3500 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

రేవంత్ రెడ్డి సారథ్యంలో కోరుట్ల నియోజకవర్గానికి ఇప్పటివరకు 3500 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలని, నిర్మాణ పురోగతికి అనుగుణంగా డబ్బులు నేరుగా ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు. అలాగే అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అధిక మొత్తంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.7 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు అందజేసినట్లు వెల్లడించారు.

### ప్రజాసేవ చేయడం మా అదృష్టం

స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు ఆశయ సాధన కోసం ఆయన తనయులుగా మేము అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని జువ్వాడి బ్రదర్స్ పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### మున్సిపల్ కార్మికులకు అన్నదాన కార్యక్రమం

వర్ధంతి కార్యక్రమం అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజాం, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి



- 950 మంది సిబ్బందితో పటిష్ట భద్రత జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులు ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా 950 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ తెలిపారు. కొండగట్టు జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ గారు మాట్లాడుతూ... బందోబస్తును 6 సెక్టార్లుగా విభజించి, 3 షిఫ్టుల విధానంలో పోలీసు సిబ్బందికి విధులు కేటాయించినట్లు వెల్లడించారు. జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీసు సిబ్బంది ఓపికతో సలహాలు, సూచనలు ఇస్తూ విధులు నిర్వర్తించాలని, ఎక్కడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో పనిచేసి జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా దేవస్థానం, మాల విరమణ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్లను పాటించేలా చూడాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు పోలీసు నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో ఆంజనేయస్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేలా ప్రతి పోలీసు బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు.

### పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ మరియు పార్కింగ్ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ కాకుండా నియంత్రణ చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా స్టాపర్లు, కోన్స్, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### కాలినడకన వచ్చే భక్తులకు సూచనలు

హనుమాన్ దీక్ష తీసుకున్న భక్తులు కాలినడకన కొండగట్టుకు వచ్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్లను వారి బ్యాగులు, జెండాలకు అంటించడం జరిగిందన్నారు. రోడ్డు ఇరువైపులా నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వాహనాలను గమనిస్తూ తమ గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, పురుషోత్తం రెడ్డి, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి, సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, వివిధ జిల్లాలకు చెందిన సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గడి స్థలాల రక్షణకు కోరుట్లలో అఖిలపక్ష ఐక్యత







- అక్రమ విఎల్టీల రద్దుకు అన్ని పార్టీల కౌన్సిలర్ల మద్దతు
- మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంతో రద్దు ఖాయమంటున్న ప్రజాసంఘాలు



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పురాతన గడి బురుజులు, కోనేరు..ప్రజా స్థలాల పరిరక్షణ కోసం కొనసాగుతున్న ఉద్యమం కీలక దశకు చేరుకుంది. చాళుక్య-జైనుల కాలం నాటి చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని అఖిలపక్ష ప్రజాసంఘాలు గత కొన్నేళ్లుగా దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, గడి స్థలాల్లో అక్రమంగా మంజూరైన విఎల్టీల రద్దుకు ఇప్పుడు అన్ని పార్టీల కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ముందుకు రావడం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు విఎల్టీల రద్దుకు మద్దతుగా సంతకాలు చేయగా, తాజాగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహేద్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం జయలక్ష్మీ-వేణుగోపాల్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ అన్నం లావణ్య అనీల్ కూడా సంతకాలు చేశారు. మిగతా కౌన్సిలర్లు కూడా క్రమంగా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. దీంతో మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానం జరిగే అవకాశాలు బలపడుతున్నాయని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి. గడి స్థలాల్లో సుమారు 5800 గజాల భూమిపై నకిలీ దస్తావేజులతో విఎల్టీలు మంజూరు చేశారని ఆరోపిస్తూ ప్రజాసంఘాలు ఇప్పటికే నిరసన దీక్షలు, రాస్తారోకోలు నిర్వహించాయి. ఈ వ్యవహారంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో అప్పటి కమిషనర్ రవీందర్‌ను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం కూడా ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, అఖిలపక్ష కన్వీనర్ ఎం.డి. ముజాహిద్ మాట్లాడుతూ.. గడి స్థలాలు కోరుట్ల ప్రజల ఆస్తి అని, వాటిని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అక్రమ విఎల్టీలను వెంటనే రద్దు చేసి అక్కడ కూరగాయల మార్కెట్, ఆహ్లాదకరమైన పార్కు, మైసమ్మ దేవాలయం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దసరా మహిషాసుర మర్దన, బతుకమ్మ, గణేష్, మొహరం వంటి సాంప్రదాయ ఉత్సవాలు యథావిధిగా అక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఔ ప్రకారం ప్రజా ఆస్తుల పరిరక్షణ బాధ్యత మున్సిపాలిటీలపై ఉందని నాయకులు గుర్తు చేశారు. తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్-2019 ప్రకారం చట్టవిరుద్ధంగా, నకిలీ దస్తావేజులతో లేదా ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా మంజూరైన అనుమతులను రద్దు చేసే అధికారం మున్సిపల్ సంస్థలకు ఉందని వివరించారు. 'మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేస్తే అక్రమ విఎల్టీల రద్దుకు బలమైన చట్టపరమైన ఆధారం ఏర్పడుతుంది. గడి బురుజు భూములు ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదౌ అవి ప్రజల ఆస్తి'అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, చింతా భూమేశ్వర్, కుంచెం శంకర్, షాహేద్ మహ్మద్ షేక్, పోతని సత్యం తదితర అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్



- గజ్వేల్‌లో అభివృద్ధి పనులకు వేగం పెంచాలి
- టెండర్లు వెంటనే తెరిచి పనుల ఉత్తర్వులు ఇవ్వండి
- ప్రధాన ఇంజనీర్ కార్యాలయంలో తుంకుంట నర్సారెడ్డి వినతి

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభం కావాలంటే పెండింగ్‌లో ఉన్న టెండర్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి పనుల ఉత్తర్వులు జారీ చేయాలని గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన ఇంజనీర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను తుంకుంట నర్సారెడ్డి , పురపాలక సంఘ కమిషనర్ ఆర్. వెంకట్ గోపాల్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురపాలక సంఘ పరిధిలో రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. కానీ టెండర్లు ఆలస్యం కావడంతో పనులు ప్రారంభం కాకుండా నిలిచిపోయాయని, దీని వల్ల పట్టణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగితే ప్రజలకు సౌకర్యాలు మెరుగవుతాయని, రానున్న వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువల పనులు తక్షణమే ప్రారంభం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా రహదారుల మరమ్మతులు, అంతర్గత రోడ్ల అభివృద్ధి, పరిశుభ్రత పనులు వంటి అనేక కార్యక్రమాలు టెండర్లపై ఆధారపడి ఉన్నాయని, అందుకే టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి పనుల ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ మహేష్ కూడా పాల్గొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందిస్తూ, టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరలోనే తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొన్నారు.

# నిరంజన్ రెడ్డిని పరామర్శించిన బిసివై కన్వీనర్ హరిబాబు యాదవ్

**నేటి సాక్షి,చౌడేపల్లి:** మండలంలోని పరికిదొన పంచాయతీ కంపల్లి కి చెందిన



నిరంజన్ రెడ్డి .లద్ధిగం సబ్ స్టేషన్ లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై గాయాల పాలైన విషయం విధితమే ప్రస్తుతం అతను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు .విషయం తెలుసుకున్న పుంగనూరు నియోజకవర్గ బీసీవై పార్టీ కన్వీనర్ హరిబాబు యాదవ్ ఆసుపత్రికి వెళ్లి బాధితుడు ,ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు, నిరంజన్ రెడ్డికి ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని అక్కడే వైద్యులను ఆయన కోరారు, బాధితుడికి అతని కుటుంబ సభ్యులకి బీసీవై పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని. ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో బిసివై పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మెట్ పెల్లి డివిజన్ ప్రజావాణి

### ఆకస్మికం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ..ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యం తో గత వారం నుండి డివిజన స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బండి రమేష్‌కు ఘన సన్మానం

### కొనసాగుతున్న అభినందనల వెల్లువ



**నేటి సాక్షి, కూకట్‌పల్లి (ప్రసాద్):** కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనకు వివిధ వర్గాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ పార్టీ కార్యాలయమైన హేమ దుర్గా భవన్‌లో బాలాజీ నగర్ కమ్మ సంఘం, ఈసీఐఎల్ కమ్మ సంఘం నాయకులు బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఆయనకు పూల బొకేలు అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బాలాజీ నగర్‌లో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, సహాయ సహకారాలు అందించాలని వారు చైర్మన్‌ను కోరారు. విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన బండి రమేష్.. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో నెలకొన్న స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు త్వరలోనే పాదయాత్ర నిర్వహిస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గన్నేరువరం మండలానికి గుర్తింపు

**నేటి సాక్షి, గన్నేరువరం:** గన్నేరువరం మండలం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, బ్యాంకు లింకేజీ రంగంలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. బ్యాంకు రుణాల రికవరీలో 100 శాతం లక్ష్యాన్ని సాధించడంతో పాటు, డిజిటల్ లిటరసీ (నగదు రహిత లావాదేవీల) నిర్వహణలోనూ అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఈ అద్భుత విజయానికి గుర్తింపుగా సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధికారులకు డీఆర్డీఓ శ్రీధర్ అవార్డును ప్రదానం చేశారు. మండలంలోని మహిళా స్వశక్తి సంఘాల క్రమశిక్షణ, బ్యాంకు లావాదేవీల్లో పారదర్శకత వల్లే ఈ అవార్డు దక్కిందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. 100 శాతానికి పైగా అచీవ్‌మెంట్ సాధించి రాష్ట్రానికే గన్నేరువరం ఆదర్శంగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓజీ శ్రీనివాస్, వివిధ మహిళా సంఘాల సభ్యులు, సెర్ప్ ప్రతినిధులు మరియు మండల అధికారులు పాల్గొన్నారు. తమ మండలానికి రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల స్థానిక మహిళా సంఘాల సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.